సాక్షి
కుమురం భీం

మంగళవారం । 23 । జనవరి । 2024

దహెగాం: మండల కేంద్రంలో శోభాయాత్ర





రెబ్బెన: గోలేటిలో సీతారామ, ఆంజనేయుడి వేషధారణలో చిన్నారులు



కౌటాల: దేవుడికి మొక్కుతున్న భక్తురాలు

శ్రీరామ.. జయజయ రామ..

ఆసిఫాబాద్: అయోధ్య బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వేళ సోమవారం జిల్లాలో రామనామ స్మరణ మార్మోగింది. శ్రీరామ.. జయజయ రామ.. అంటూ వీధుల్లో భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాల్లో హోమాలు, అన్నదాన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజనలు చేపట్టారు. జిల్లా కేంద్రం కాషాయమయంగా మారింది. జానకీపురం(జన్కాపూర్) కోదండ రామాలయంలో అర్చకులు నిమ్మకంటి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం హోమం నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ తెరపై రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వీక్షించారు. కేశవనాథ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు డీజే పాటలు, కాషాయ కండువాలు, జెండాలతో జన్కాపూర్ రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దస్నాపూర్ గ్రామస్తులు సైతం ర్యాలీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బుల్లితెర దర్శక, నిర్మాత సురేశ్‌కుమార్ తదితరులు ఆలయాల్లో పూజలు చేశారు. శివకేశవ మందిర్‌లో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా, రామరక్షాస్తోత్ర పఠనం చేశారు. రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ మండల అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు, ఆలయ కమిటీ ప్రతినిధులు దేగల సత్యనారాయణ, భద్రయ్య, శంకరయ్య, సీహెచ్ రవి, మహేశ్, శివచందు, పర్రె గిరి, తాటిపెల్లి దిలీప్, గంధం శ్రీనివాస్, గుండ ప్రమోద్, అభయ్‌కుమార్ ఆచార్య, మనోజ్ వైరాగరే పాల్గొన్నారు. కాగా.. ఎస్పీ సురేశ్‌కుమార్ ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లోని శ్రీరామ, హనుమాన్ ఆలయాల వద్ద బందోబస్తును పరిశీలించారు. డీఎస్పీ కరుణాకర్, సీఐలు రాణాప్రతాప్, నరేందర్, బుద్దే స్వామి ఉన్నారు.



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు



ఆసిఫాబాద్: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు



ఆసిఫాబాద్‌అర్బన్: బాబాపూర్ హనుమాన్ ఆలయంలో..



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ్ మందిర్‌లో..

న్యూస్‌రీల్

మహాపూజకు ఆహ్వానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి ఆలయంలో ఈ నెల 25న మహాపూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఆర్‌వో సురేశ్‌ను సోమవారం ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు ఆహ్వానించారు. కలెక్టరేట్‌లో మహాపూజ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఝరి సర్పంచ్ కుమురం న్యానేశ్వర్, ఆదివాసీ నాయకులు మడావి భరత్, తుకారాం ఉన్నారు.


బందోబస్తు పరిశీలించిన ఎస్పీ



గోలేటిలో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో సోమవారం జిల్లాలో చేపట్టిన శోభాయాత్రల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో బందోబస్తును ఎస్పీ సురేశ్‌కుమార్ పరిశీలించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ఇతరులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలకు పటిష్ట బందోబస్తు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన



ఆసిఫాబాద్ అర్బన్: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు కెరమెరి మండలం గోండి, పది గంటలకు జంగుబాయి ఆలయాన్ని సందర్శించనున్నారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించనున్నారు.

అమాత్యా.. ఆలకించండి

- జంగుబాయి పుణ్యక్షేత్రానికి నేడు రాష్ట్ర మంత్రి
- అమ్మవారిని దర్శించుకోనున్న సీతక్క
- సమస్యల పరిష్కారంపై భక్తుల ఆశలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల కొంగుబంగారం.. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి అమ్మవారి క్షేత్రానికి మహోన్నత చరిత్ర ఉంది. ప్రతీ ఏటా రెండుసార్లు ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి ఆదివాసీలు ఇక్కడికి పాదయాత్రగా వచ్చి అమ్మవారి మొక్కులు చెల్లిస్తుంటారు. ఒడిస్సా నుంచి జంగుబాయి అమ్మవారు ఇక్కడికి వచ్చి బస చేసిందని పురాణాలు చెబుతున్నాయి. అయితే ఏళ్లు గడుస్తున్నా.. భక్తుల సంఖ్య పెరుగుతున్నా మౌలిక సదుపాయాలు మెరుగుపడటం లేదు. కనీసం జంగుబాయి ఆలయానికి రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ నుంచి అనుమతులు కూడా మంజూరు కావడం లేదు. ఈ తరుణంలో మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రి ధనసరి అనసూ(సీతక్క) ఆలయాన్ని సందర్శించనున్నారు. టొప్లకస, సిద్దికస, రావుడ్ దేవతలు, పోచమ్మ, మైసమ్మలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం జంగుబాయి గుహను దర్శించుకుంటారు.



అమ్మవారు కొలువైన గుహ

మొదటిసారి ఆలయానికి రాష్ట్ర మంత్రి రానుండటంతో అభివృద్ధి పనులపై భక్తులు ఆశలు పెట్టుకున్నారు. ఈ నెల 25న ఎనిమిది గోత్రాలకు చెందిన కటోడాలు సంయుక్తంగా నిర్వహించే మహాపూజ కార్యక్రమానికి మంత్రి హాజరు కావాల్సి ఉంది. అనివార్య కారణాలతో మంత్రి ముందుగానే అమ్మవారిని దర్శించుకుంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఏళ్లుగా పెండింగ్‌లోనే..

కాంగ్రెస్ సర్కారు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించిన విషయం తెలిసిందే. గిరిజన నాయకురాలైన మంత్రి సీతక్కపై ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న జంగుబాయి ఆలయ క్షేత్రంలో ఏళ్లుగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన కోసం కమిటీ సభ్యులు, ఆదివాసీలు నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నపాలు సమర్పిస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు కావడం లేదు.



ఆలయంలోని పోచమ్మ తల్లి

ప్రధాన డిమాండ్లు

- జంగుబాయి అటవీ ప్రాంతాన్ని ఆలయం పేరిట పట్టా చేయడం.
- ఉమ్రి వంతెన నుంచి పరందోళి వరకు బీటీ రోడ్డు నిర్మాణం.
- తాగునీటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపడం. అప్పటివరకు ట్యాంకర్లు, పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేయడం.
- త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించడం.
- అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు సేదతీరేందుకు సత్రాలు ఏర్పాటు చేయడం.
- మహిళల కోసం స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించడం.



నిర్మాణానికి నోచుకోని పరందోళి రోడ్డు

- ఎనిమిది గోత్రాల వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం.
- పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి బారికేడ్లు నిర్మించడం.

పరిష్కారం చూపాలి



జంగుబాయి అమ్మవారి దర్శనానికి వస్తున్న మంత్రి సీతక్కపై ఆశలు పెట్టుకున్నాం. అనేక సమస్యలతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి సమస్యలకు పరిష్కారం చూపుతారని ఆశిస్తున్నాం. ఆలయానికి ఓ మంత్రి రావడం ఇదే ప్రథమం. – మరప బాజీరావు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దని, అధికారులు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గడిచిన నాలుగు సంవత్సరాలు జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న తనకు మెరిట్ సెలక్షన్ లిస్టులో న్యాయం చేయాలని ఎంఏ సలీం విన్నవించాడు. గుండె జబ్బుతో బాధపడుతున్న ఆపరేషన్ చేయించుకోలేని స్థితి ఉన్నానని, తనకు దివ్యాంగుడైన ఓ కుమారుడు కూడా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఇంటి స్థలం ఇప్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ రికార్డు అసిస్టెంట్ ఎం.వెంకటరమణ దరఖాస్తు చేసుకున్నాడు. మూడేళ్లకు పైబడి అమ్మఒడి సేవల్లో విధులు నిర్వర్తిస్తున్న తనను టెండర్ పూర్తి కావడంతో తొలగించారని, ఉపాధి అవకాశం కల్పించాలని దహెగాం మండలం కోత్మీర్‌కు చెందిన ఆర్.లక్ష్మణ్ అర్జీ సమర్పించాడు. ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని, పదో తరగతి పూర్తి చేసిన తనకు ఉపాధి చూపాలని వాంకిడి మండల కేంద్రానికి చెందిన చిలుముల పద్మ వేడుకుంది. డిగ్రీ చదువుకున్న తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, కుటుంబ పోషణకు ఉపాధి కల్పించాలని ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్‌కు చెందిన గైని లక్ష్మి దరఖాస్తు చేసుకుంది. రెబ్బెన మండలం నార్లాపూర్ శివారులోని తన పేరుపై ఉన్న భూమిని తనకు, కోడలికి సమాన వాటాగా పట్టా చేసి ఇవ్వాలని దుర్గం అమ్మక్క దరఖాస్తు చేసుకుంది. కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

మెడికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న సుమారు 25 వేల మంది మెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎంఈయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ శ్రీనివాసచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలు పణంగా పెట్టిన మెడికల్ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ట్రెజరీ ద్వారా వేతనాల చెల్లించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, 18 నెలల పెండింగ్ డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను వెంటనే భర్తీ చేసి, జీవో 317ను సవరించాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. అనంతరం సీహెచ్‌సీ ఆవరణలో నూతన జిల్లా కమిటీ ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఉపేందర్, అధ్యక్షులుగా సరోజ, ఉపాధ్యక్షులుగా సుష్మా, సుజాత, ప్రధాన కార్యదర్శిగా రేణు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పద్మ, కోశాధికారిగా ఫ్లోరెన్సీ, ముఖ్య సలహాదారులుగా వందన, వేరునికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, నాయకులు విజయ్, మల్లేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసచారి

ఎగ్జిట్ వే మూసివేత



జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

- ప్రమాదాలపై స్పందించిన అధికారులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లికి చెందిన తల్లీ కొడుకు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతోపాటు ఇటీవల ఈ రహదారి ఎగ్జిట్‌ల వద్ద పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నేషనల్ హైవే నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఎగ్జిట్ ఎంట్రీలను తొలగించాలని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు అధికారులు స్పందించారు. సోమవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ సురేశ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రహదారి ఎగ్జిట్‌ను మూసివేయాలని హైవే అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో రహదారిని సిమెంట్ దిమ్మెలతో మూసి వేశారు. హైవే పైకి వెళ్లే వాహనాలు ఇక నుంచి గుండి హైవే కింద నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా జాతీయ రహదారికి కనెక్ట్ కావాలని సూచించారు. రహదారి వద్ద పోలీసులు వాహనదారులను గుండి రోడ్డువైపు మళ్లించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని సూచించారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రం నుంచి కాగజ్‌నగర్, మంచిర్యాల వైపు వెళ్లే వాహనాలు గుండి రహదారి మీదుగా హైవే పైకి వెళ్లాల్సి ఉంటుంది. గుండి రహదారి గుంతలు పడి ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గుండి రహదారి చౌరస్తా, హైవే కనెక్ట్ రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి జాతీయ ఓటర్ల దినోత్సవం, గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల పరిధిలో ఓటుహక్కు ప్రాముఖ్యత తెలియజేసే విధంగా ర్యాలీలు నిర్వహించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ నుంచి అంబేద్కర్‌చౌక్ మీదుగా తిరిగి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు, నూతనంగా ఓటరుగా నమోదు చేసుకున్న వారిని సత్కరిస్తున్నట్లు వెల్లడించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు ఓటరు గుర్తింపు కార్డుతోపాటు ఇతర వివరాలను పోస్టల్ బ్యాలెట్ కోసం సమర్పించాలని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటు ప్రాముఖ్యతను తెలియజేసే బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో పోలీసు గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అనంతరం ఏఆర్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరిలో నిర్వహించే జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఆలయ పరిసరాలు, ఆలయానికి భక్తులు వచ్చే దారులతోపాటు గంగాపూర్ వాగులో గతంలో నిర్మించిన పైపు కల్వర్టును సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. జాతరకు నెల రోజుల గడువు మాత్రమే ఉండటంతో ఇప్పటి నుంచే ఏర్పాట్ల పనులు వేగవంతం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావొద్దని, ఆలయానికి వచ్చే దారులు, తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు ఉండేలా చూడాలన్నారు. మూడు రోజుల పాటు కొనసాగే జాతరలో కీలకమైన స్వామి వారి రథోత్సవం సందర్భంగా రద్దీకి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సమీర్, ఎంపీవో అంజద్‌పాషా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, పంచాయతీ కార్యదర్శి మురళీధర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

క్లుప్తంగా

మిస్సింగ్ కేసు


దిగిడ లావణ్య

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమవడంతో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దిగిడ లావణ్య(20) ఈనెల 18న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. యువతి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుడికి గాయాలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిలో సోమవారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో యాసిన్ అనే సపోర్ట్‌మెన్ కార్మికుడి కాలికి గాయమైంది. గనిలోని 34 లెవల్‌లో విధులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా సైడ్ పెల్లలు కూలి రెండు కాళ్లపై పడ్డాయి. వెంటనే కేకే–డిస్పెన్సరీకి తరలించగా ఐదు కుట్లు వేసి రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆసుపత్రికి పంపించారు.

షార్ట్ సర్క్యూట్‌తో షాప్ దగ్ధం

మందమర్రిరూరల్: మందమర్రిలోని అలెక్స్‌మెన్స్ పార్లర్, హేర్ స్టైల్స్‌షాప్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు సుధాకర్ తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు షాపు మూసివేశాను. మార్కెట్ వర్తక వ్యాపారకమిటీ ఆధ్వర్యంలో రాముని శోభాయాత్రకు వెళ్లాను. కొద్దిసేపటికే షాపులో నుంచి పొగలురావడంతో స్థానికులు సమాచారం అందించారు. అప్పటికే షాపులో ఏసీ, టీవీ, కుర్చీలు తదితర విలువైన వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ఆర్ఐ పద్మజ ప్రమాదం జరిగిన తీరును బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే మంటలు చెలరేగినప్పుడు ఫైర్ స్టేషన్‌కు కాల్ చేస్తే మంటలార్పిన గంట తర్వాత ఫైరింజన్ రావడం విశేషం.

సిలిండర్ లీకై మంటలు



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించాయి. సోమవారం రాత్రి వంట చేసుకుందామని గ్యాస్ ముట్టించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గదిలో ఉన్న ఫ్రిడ్జి, కూలర్, మిక్సీ, వంటసామగ్రి, అరతులం బంగారం, రూ.16 వేల నగదు కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు నస్పూరి సత్తయ్య తెలిపారు. స్థానికులు మంటలార్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటసమీపంలోని జాతీయ రహదారి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. కిష్టంపేటకు చెందిన మిద్దెపాక సమ్మయ్య(42) బైక్‌పై మంచిర్యాల నుంచి చెన్నూర్ వైపు వెళ్తుండగా లారీ వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. సమ్మయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు న్యాయం చేయాలని జాతీయ రహదారి వద్ద కుటుంబ సభ్యులు బైఠాయించారు.

‘ప్రత్యేక’ పాలన

- ఫిబ్రవరి1తో ముగియనున్న సర్పంచుల పదవీ కాలం
- రిజర్వేషన్లపై సందిగ్ధం


హాజీపూర్ పంచాయతీ కార్యాలయం

నెన్నెల: స్థానికసంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. ఇప్పటికి రాష్ట్రప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలపలేదు. దీంతో ఎన్నికలు నిర్దేశిత గడువులోపు జరగవని, ప్రత్యేక అధికారుల పాలన తప్పనిసరని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక అధికారుల నియామకానికి సంబంధించిన కసరత్తును పూర్తిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగానే మండలస్థాయి అధికారుల సమాచారం సేకరిస్తున్నారు.

పర్సన్ ఇన్‌చార్జిలకు అవకాశం లేని కొత్త చట్టం..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేక అధికారులు నియమించి పల్లె పాలనను కొనసాగించాల్సి ఉంటుంది. పదవీకాలం పూర్తయిన తదనంతరం ఆయా పాలకవర్గాలను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్ల పాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్‌లు పదేళ్ల పాటు అమలులో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయా గణంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటివరకు సందిగ్ధత కొనసాగుతుంది.

జిల్లాలు	పంచాయతీలు
మంచిర్యాల	311
కుమురం భీం	335
ఆదిలాబాద్	468
నిర్మల్	396

మండల స్థాయి అధికారులతో..

గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమించనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీవో, వ్యవసాయాధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

సార్వత్రిక ఎన్నికల తర్వాతే పల్లెపోరు

రాష్ట్రంలో అధికారంలో చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈనెల 20వ తేదీ నుంచి ఇంటింటా సర్వే చేపట్టి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మే నెలాఖరులోగా పూర్తిచేసిన తర్వాతే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ఏక కాలంలో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- జీఎం సంజీవరెడ్డి


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: నస్పూర్ గోదావరి కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో ఈనెల 26న 75వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్టేడియంలో సందర్శించి వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల నూతనంగా ఇక్కడ ప్రాణహిత క్రీడా మైదానం ఏర్పాటు చేశామని, ఇందులో తొలిసారిగా వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా గనుల్లో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి సన్మానం చేసి, ప్రశంసపత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పురప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓటూజీ కె.రఘుకుమార్, డీజీఎం (పర్సనల్) పి.అరవిందరావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పీవో కాంతారావు, సివిల్ ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని కారుబోల్తా

- ఒకరికి తీవ్రంగా, పలువురికి స్వల్పగాయాలు


బోల్తా పడిన కారు

కాసిపేట: ట్యాంకర్ ఢీకొని కారు బోల్తా పడిన ఘటన కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి ఫ్లైఓవర్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలాఉన్నాయి.. ఆసిఫాబాద్‌కు చెందిన మైస రమ్యకృష్ణ, భర్త రమేశ్, పగిడి మాధవి మరో 7 ఏడేళ్ల చిన్నారి కారులో మందమర్రి వైపు నుంచి ఆసిఫాబాద్ వెళ్తున్నారు. ఈక్రమంలో ఓవర్ టేక్ చేస్తూ హైవే పనులు నిర్వహించే హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన ట్యాంకర్ కారును ఢీకొంది. సుమారు 50 మీటర్లకు పైగా కారు రోడ్డుపై లాక్కెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న రమ్యకృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. మిగతావారికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. కాగా, కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. లేకపోతే బ్రిడ్జి కిందకు పడిపోయేది. ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరగడంతోపాటు ముందు ఉన్న మరో కారును ఢీకొట్టింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

బోర్‌వెల్ లారీబోల్తా

- అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టగా ప్రమాదం
- రెబ్బెన మండలం ఖైరిగాం వద్ద జాతీయ రహదారిపై ఘటన
- ఒకరి మృతి, పలువురికి తీవ్ర గాయాలు


బోల్తాపడిన బోర్‌వెల్ లారీ


ధీరన్ మృతదేహం

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం ఖైరిగాం వద్ద బోర్‌వెల్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీ ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమం, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన తిరుమల బోర్‌వెల్స్‌కు చెందిన బోర్‌వెల్ లారీ సోమవారం రాత్రి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తోంది. మార్గమధ్యలో ఉన్న ఖైరిగాం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా వాహనాన్ని నడపటంతో అదుపు తప్పి కుడివైపున డివైడర్‌ను ఢీకొట్టింది. వాహనంలో ఉన్న కలకత్తాకు చెందిన కూలీ ధీరన్ (40) అక్కడిక్కడే మృతి చెందగా, గుడిహత్నూర్‌కు చెందిన డ్రైవర్ చిత్రుతోపాటు కలకత్తాకు చెందిన కూలీలు అరవింద్, ఆనంద్, సమీర్ లాల్, లాల్ చంద్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ఘటన స్థలానికి చేరుకుని జిత్రు, అరవింద్, ఆనంద్‌లను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి, సమీర్‌లాల్, లాల్ చంద్‌లను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ చిత్రు పరిస్థితి విషమంగా ఉంది. లారీ బోల్తాపడటంతో ఆసిఫాబాద్ వైపు నుంచి రెబ్బెన వైపు వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నేషనల్ హైవే సిబ్బంది సహకారంతో ఎస్సై.. లారీని క్రేన్ సహాయంతో తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

మహిళా సాధికారిత దిశగా ముందుకు సాగుదాం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధి కోసం మహిళా సాధికారత హబ్ పని చేస్తుందని మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సిక అన్నారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సమావేశ మందిరం, ముల్కల్ల ప్రాథమిక పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు కార్యక్రమాల్లో మాట్లాడారు. జిల్లా సంక్షేమాధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత హబ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భేటి బచావో.. భేటి పడావో, బాలికలు, మహిళల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్లకు సమాచారం అందజేసేలా చూడాలని అవగాహన కల్పించారు. ఎంపీపీ స్వర్ణలత, ఎంపీటీసీలు సుజాత, అనూబాయి, పశువైద్యాధికారులు సరిత, శాంతిరేఖ, మండల వైద్యాధికారి లహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం

పాతమంచిర్యాల: పాతమంచిర్యాలలోని రామాలయంలో సోమవారం శ్రీ రామభక్త కరసేవకులను రామానుజ దేవదూత జీయర్‌స్వామి సన్మానించారు. తోట తిరుపతి, బొలిశెట్టి కిషన్, రామగిరి తిరుపతి, పెద్దోజు హన్మంతు, బొలిశెట్టి లక్ష్మణ్, తూముల శ్రీనివాస్, బొలిశెట్టి లచ్చన్నను పూలమాలతో సత్కరించారు. అంతకుముందు సీతారాముల కల్యాణం నిర్వహించారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తమను సన్మానించడం సంతోషంగా ఉందని కరసేవకులు తెలిపారు.

లోడర్ ప్రారంభం


ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో బొగ్గు రవాణాను వేగవంతం చేయడంలో భాగంగా నూతనంగా కొనుగోలు చేసిన భారీ సామర్థ్యం గల లోడర్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5.3 కోట్లతో ఈ లోడర్‌ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో బొగ్గు రవాణా మరింత మెరుగవుతుందన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి పురుషోత్తంరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, నాయకులు సత్తయ్య, గని సంక్షేమ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి విద్యారత్న అవార్డు


అవార్డును అందజేస్తున్న ప్రిన్సిపాల్

లక్సెట్టిపేట:మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న తన్నీరు సురేశ్‌కు జాతీయ విద్యారత్న పురస్కారం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జైకిషన్ ఓజా తెలిపారు. కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూ విద్యారంగానికి అందిస్తున్న సేవలకు హైదరాబాద్‌కు చెందిన ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇందిరాదేవి అవార్డును కళాశాలకు పంపించారు. కళాశాల ఆవరణలో సోమవారం అవార్డును సురేశ్‌కు ప్రిన్సిపాల్ ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ గంగయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగ్గులో అయోధ్య మందిరం


మంచిర్యాలటౌన్: చున్నంబట్టి వాడలో ముగ్గు వేస్తున్న తిరుమల

చెన్నూర్/మంచిర్యాలటౌన్/దండేపల్లి: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా చెన్నూర్ పట్టణమంతా రామనామస్మరణతో మార్మోగింది. రాములోరిపై ఉన్న భక్తిని పలువురు వివిధ రూపాల్లో చాటుకున్నారు. పుప్పాల హనుమాన్ వీధిలో పుల్యాల అంజన్న కుమార్తె అలేఖ్య ఇంటి ముంగిట రాములోరి గుడిని ముగ్గు వేయగా అందరినీ ఆకట్టుకుంది. ఆదర్శనగర్ కాలనీకి చెందిన బొడ్డు కమల రాముని రూపాన్ని ముగ్గుతో అలంకరించి తన భక్తిని చాటుకున్నారు. మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టికి చెందిన కొండవీటి తిరుమల.. అయోధ్య రామమందిరం ముగ్గును వేసి ఆకట్టుకుంది. దండేపల్లి మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఇంటి వాకిళ్లలో కొందరు మహిళలు అయోధ్య రామమందిరం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


చెన్నూర్: ఆదర్శనగర్ కాలనీలో రాముని రూపం తీర్చిదిద్దుతున్న కమల


దండేపల్లి: ముగ్గులో అయోధ్య రామమందిరం


చెన్నూర్: అలేఖ్య వేసిన ముగ్గు

ప్రాణంపెట్టి.. ప్రతిమను మలచి

- బాలరాముని ప్రాణప్రతిష్ఠ రోజే మూలవిరాట్ రూపకల్పన
- 12 గంటల్లో మట్టిశిల్పాన్ని తీర్చిదిద్దిన కళాకారుడు భీమేష్


బాలరాముని విగ్రహంతో పోలీస్ భీమేష్

నిర్మల్‌ఖిల్లా: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగుతుండగానే భక్తి తన్మయత్వంతో అప్పటికప్పుడే మూలవిరాట్ పోలిన శిల్పాన్ని తీర్చిదిద్దాలని సంకల్పించాడు ఆ యువకుడు. అనుకున్నదే తడవుగా దాదాపు 12 గంటల పాటు శ్రమించి మట్టిశిల్పాన్ని జీవకళ ఉట్టిపడేలా తీర్చిదిద్దాడు. నిర్మల్ మండలం అనంతపేట్‌కు చెందిన యువ కళాకారుడు పోలీస్ భీమేష్ సాధారణ బంకమట్టితోనే అద్భుతమైన బాలరాముడి విగ్రహాన్ని చూడచక్కని రూపంలో రూపొందించాడు. సాయంత్రానికల్లా తుది మెరుగులు దిద్దాడు. చెరువుమట్టితో అద్భుతమైన కళాఖండం రూపొందింది. నుదుట తిలకం, చూడచక్కని ముఖ వర్చస్సు, తలపై భాగంనుంచి మెడ వరకు కేశాలు, శిరస్సు భాగాలన్నీ కేవలం చేతితోనే అందమైన ఆకృతిలో మలచడం విశేషం. కేవలం చెరువులోని బంకమట్టి, ఒకటి రెండు సహజరంగులు ఉపయోగించినట్లు పేర్కొంటున్నాడు. బాలరాముని నమూన ప్రతిమ పలువురిని విశేషంగా ఆకట్టుకుంటోంది.

సైకిల్‌పై అయోధ్యకు


సచిన్‌కు పూలమాల వేస్తున్న గ్రామస్తులు

తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్‌కు చెందిన ఆత్రం సచిన్ సైకిల్‌పై అయోధ్యకు బయల్దేరి వెళ్లాడు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని సోమవారం తన సైకిల్ యాత్రను ప్రారంభించాడు. గ్రామస్తులు సచిన్‌కు రూ.10 వేలు విరాళంగా అందజేశారు.

బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రం


సురేఖకు రాముని చిత్రపటాన్ని అందిస్తున్న శిరీష

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఎమ్మెస్సీ జువాలజీ చదువుతున్న శానగొండ శిరీష బియ్యం గింజలతో శ్రీరాముని చిత్రపటాన్ని తయారు చేసి సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు బహుమతిగా అందించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మంచిర్యాలలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన సతీమణి సురేఖ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఈ చిత్రపటాన్ని అందించడం ఆనందంగా ఉందని శిరీష తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జిల్లాల నుంచి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర డెప్యూటీ ప్రధాన కార్యదర్శి అలవేందర్ వేణుమాధవ్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు చాలీచాలని పెన్షన్‌తో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులో కోత విధించొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభయహస్తం గ్యారెంటీ స్కీంను వర్తింపజేయాలన్నారు. తెల్ల రేషన్‌కార్డులు, ఆసరా పెన్షన్ ఇవ్వాలని కోరారు. 2016 జూలై 1, నుంచి పెరిగిన రూ.20 లక్షల గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. అనంతరం సింగరేణి సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీరయ్య, జాయింట్ సెక్రెటరీ ఎస్.నర్సింగ్‌రావు, నాయకులు లింగయ్య, లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మద్దతు

ఏఐటీయూసీ అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజకుమార్ ఈ ధర్నాకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘంగా తాము రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. యూనియన్ అధనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య, నాయకులు శేషయ్య, వెంకట్ పాల్గొన్నారు.